దరఖాస్తుల ఆహ్వానం

చౌదరిగూడ, జూన్ 6(ఆంధ్ర జ్యోతి): పదవ తరగతి పాసైన బాలికలు ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని కేజీబీవీ ప్రత్యేకాధికారి రాగసుధ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్ కేజీబీవీ పాఠశాలలో (2025-26) ఇంటర్ ప్రథమ సంవత్సరానికి ఎంపీసీ 40, బైపీసీలో 40సీట్లు ఉన్నాయని, అడ్మిషన్ కోసం విద్యార్థులు నేరుగా పాఠశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. విద్యాబోధన ఆంగ్ల మాధ్యమంలో కొనసాగుతుందన్నారు. అలాగే గెస్ట్ ఫ్యాకల్టీగా మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ, తెలుగు, ఇంగ్లిష్, జువాలజీ, బోటని సబ్జెక్టులు బోధించేందుకు పీజీ, బీఎడ్ పూర్తిచేసిన మహిళలు వారం రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న ప్రజలు

కేశంపేటలో తిరంగా ర్యాలీ

కేశంపేట, జూన్ 6(ఆంధ్యజ్యోతి): పాక్ ఉగ్రవాద చర్యలను తిప్పికొట్టేందుకు చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్ విజయవంతం కావడంతో శుక్రవారం కేశంపేటలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ జెండాలను చేతబూని దేశానికి, సైనికులకు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షురాలు రాధిక, నాయకులు మహేష్, రొల్లు రాఘురాములు గౌడ్, మోటే శ్రీనివాస్, యుగంధర్, నరేందర్ రెడ్డి, తిరుపతి, నర్సింహా, చౌడం శ్రీనివాస్, కుమార్ గుప్తా, ఐలయ్య, ఉదయ్ కుమార్ గౌడ్, దన్నేడి కుమార్ పాల్గొన్నారు.



ముందస్తు మురిపించిన వరుణుడు.. ప్రస్తుతం ముఖం చాటేశాడు. జిల్లాలోకి నైరుతి రుతు పవనాలు ముందుగానే ప్రవేశించడంతో తొలకరి జల్లులు పడ్డాయి. వారం రోజులపాటు వానలు విస్తారంగా కురియడంతో రైతన్నలు పొలంబాట పట్టారు. దుక్కులు దున్ని.. ఎరువులు, విత్తనాలు తెచ్చిపెట్టుకున్నారు. కొన్ని ప్రాంతాల్లో పత్తి విత్తనాలు కూడా విత్తారు. మరికొందరు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. ఏమైందో ఏమో వారం పది రోజులుగా వాన జాడ లేకుండా పోయింది. ఓ వైపు ఎండలు భగ్గుమంటుడటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. మృగశిర కార్తెలోనైనా వర్షాలు కురియకపోతాయా అని ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్నారు.

మేఘమా కురువవే!

ముఖం చాటేసిన వరుణుడు

ముందస్తు మురిపించి కనుమరుగు.. పది రోజులుగా మండుతున్న ఎండలు
వర్షాల కోసం రైతన్నల ఎదురుచూపు.. మృగశిర కార్తెలోనైనా వర్షం కురిసేనా?

వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లు)

సంవత్సరం	సాధారణ	నమోదు
2020-21	694.6	1226.2
2021-22	694.6	952.6
2022-23	694.6	1122.0
2023-24	725.6	721.9
2024-25	725.6	937.4
2025-26	725.6	5.3

రంగారెడ్డి అర్బన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలం సీజన్ ప్రారంభం కాకముందే కురిసిన వర్షాలు రైతన్నల్లో ఆశలు రేకెత్తించాయి. ఈ సారి వానలు బాగానే పడతాయిలే అని ఆశపడిన కర్షకుడికి మళ్లీ చినుకు చింత మొదలైంది. వారం పది రోజుల నుంచి వరుణుడు ముఖం చాటేయడంతో సాగు సందిగ్ధంలో పడింది. కొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే వేసిన ప్రధాన పంటలు భానుడి భగభగలకు మొలకెత్తలేవు. వానాకాలంలోనూ ఎండలు మండి పోతున్నాయి. కాడి పట్టాలనుకునే కర్షకుడి కళ్లు బైర్లు కమ్ముతున్నాయి. ఏటా ఇదే పర్థితి నెలకొంటుంది. ఈ ఏడాది మే నెలాఖరులో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిశాయి. ఆ తర్వాత మేఘాలు దోబూచులాడుతున్నాయి. వారం నుంచి వేసవిని మించి ఎండలు దంచి కొడుతున్నాయి. చినుకు జాడ కరువైంది. దీంతో సాగు ముందుకు కదలడం లేదు. ఈ ఏడాది కూడా సాగు కష్టాలు తప్పవని ఆందోళన చెందుతున్నారు. మే నెలలో సాధారణ వర్షపాతం 29.9 మిల్లిమీటర్లు కాగా

మిగతా 8వ పేజీలో...

పత్తి మొలకలు వాడుతున్నాయి



ఈ సారి నైరుతి రుతుపవనాలు ముందుగా వచ్చినా ఇంత వరకు భారీ వర్షాలు కురియలేదు. చెదురుమదురుగా పడిన వానకు పత్తి విత్తనాలు విత్తినాం. వాన జాడ లేకుండా పోవడంతో మొలకెత్తిన మొలకలు ఎండుముఖం పట్టాయి. పది రోజులుగా ఎండలు దంచికొడుతున్నాయి. ఇలాగే మరికొన్ని రోజులు వర్షం పడకుంటే మళ్లీ విత్తనాలు నాటాల్సి వస్తది.

బి.శ్రీనివాస్, రైతు, కుర్మిద్ద


సమావేశంలో పాల్గొన్న ఆకునూరి మురళి, సుశీంద్రరావు

పబ్లిక్ స్కూల్స్‌గా ప్రభుత్వ పాఠశాలలు

» తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి

మంచాల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలను తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా అభివృద్ధి పరిచేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి ముందుకు వెళ్తున్నామని రాష్ట్ర విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళి తెలిపారు. మంచాల మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను శుక్రవారం డైరెక్టర్ జ్యోష్ణ పద్మ, జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు, డిప్యూటీ నోడల్ అధికారి రామారావులతో కలిసి ఆయన సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన పేరెంట్స్ కమిటీ మీటింగ్‌లో పాల్గొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధి కమిటీలను ఎంపిక చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల అభ్యున్నతికి అందరూ కలిసి రావాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో ఉమారాణి, ఎంఈవో రాందాస్, ప్రధానోపాధ్యాయులు తుల్జారాం, అధ్యాపకులు సలీం, ఆనంద్, నారాయణరెడ్డి, జంగయ్య, అనిత, మీన, వెంకటేష్ పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

భవిష్యత్ ఏఐదే..

» మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య

శంషాబాద్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్ అంత ఏఐదేనని మాజీ మంత్రి పొన్నాల లక్ష్మయ్య వ్యాఖ్యానించారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని పద్మజా పల్మ్ గ్రోవెస్ రిసార్ట్‌లో తెలంగాణ ట్రైయినింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ (టీపీవో) కేరియర్ నెక్సెస్ 2025 ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన 100 హెచ్‌ఆర్‌లు, వివిధ కంపెనీలకు చెందిన 250 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన పొన్నాల మాట్లాడుతూ.. ఏఐ ద్వారా ఉద్యోగావకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఏఐతో యువతకు ఉజ్వల భవిష్యత్ ఉంటుందని పేర్కొన్నారు. శాస్త్రసాంకేతిక రంగాల్లో ఏఐ పాత్ర చాలా కీలకంగా మారుతుందన్నారు. టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హా మాట్లాడుతూ.. తెలంగాణలో ఉన్న అన్ని ఇంజనీరింగ్ కళాశాలలు, డిగ్రీ అసోషియేషన్ సభ్యులు పాల్గొనే ఈవెంట్‌లో విద్యార్థులకు శిక్షణ ఇచ్చి ప్లేస్‌మెంట్‌లు కల్పిస్తామని చెప్పారు. ఇప్పటి వరకు దాదాపు తెలుగు రాష్ట్రాల్లో 20 వేల మంది విద్యార్థులకు ట్రెయినింగ్ ఇచ్చామన్నారు. వచ్చే మూడేళ్లలో లక్ష మందికి శిక్షణ ఇచ్చేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీనివాస్‌రావు, సందీప్ శర్మ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా బొడ్రాయి పండుగ

షాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో బొడ్రాయి పండుగను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. బొడ్రాయి వద్ద ఉదయం నుంచి గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. డప్పు చప్పుళ్లు, పోతరాజుల విన్యాసాలు, శివసత్తుల పూనకాలు, యువకుల కేరింతల మధ్య మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి నైవేద్యం సమర్పించారు. గ్రామ ప్రజలు చల్లంగా ఉండాలని, వర్షాలు సకాలంలో కురిసి పాడిపంటలు సమృద్ధిగా పండాలని మొక్కుకున్నారు.

బక్రీద్‌కు సర్వం సిద్ధం


సెంటు సీసాల అమ్మకాలు..

త్యాగం, భక్తిభావానికి ప్రతీకగా నిలిచే బక్రీద్‌ను జరుపుకునేందుకు ముస్లింలు సిద్ధమయ్యారు. శనివారం పండుగ నేపథ్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు జిల్లాలోని ఈద్గాలు, మసీదుల్లో ఏర్పాట్లు చేశారు. పండుగ సందర్భంగా గొర్రెల అమ్మకాలు జోరుగా సాగాయి. కొనుగోలు దారులతో మార్కెట్లు కిటకిటలాడాయి.

- ఆంధ్రజ్యోతి ఫొటోగ్రాఫర్, రంగారెడ్డి జిల్లా


జల్పల్లిలో గొర్రెలను కొనుగోలు చేస్తున్న ముస్లింలు


చర్లపటేల్‌గూడ-తుర్కగూడ గ్రామాల మధ్య తవ్వి వదిలేసిన రోడ్డు

నత్తేనయం..!

కొనసా..గుతున్న రోడ్డు విస్తరణ

తవ్వి వదిలేయడంతో ప్రమాదాలు
పనులు చేయడంలో కాంట్రాక్టర్ నిర్లక్ష్యం
ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ఆదిభట్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పరిధిలోని చర్లపటేల్‌గూడ నుంచి కందుకూరు మండలంలోని రాచులూర్ గ్రామం వరకు విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. కేంద్ర రహదారి మౌలిక వసతులు(సీఆర్‌ఐఎఫ్) నిధులు రూ. 30 కోట్లతో 18 కిలోమీటర్లు, 7 మీటర్ల వెడల్పుతో మార్చి నెలల్లో డబుల్ రోడ్డు పనులు ప్రారంభించారు. మొదటి దఫాల్లో చర్లపటేల్‌గూడ నుంచి తుర్కగూడ వరకు ఉన్న బీటీ రోడ్డును తవ్వి వదిలేశారు. పనులు చేపట్టి రెండు నెలలు గడుస్తున్నా పురోగతి కనిపించడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతో పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. దీంతో రోడ్డుపై దుమ్ము,

మిగతా 8వ పేజీలో...


సీసీ రోడ్డు పక్కన తవ్వి వదిలేశారు ఇలా..

వాహనాలు పాడవుతున్నాయి



చర్లపటేల్‌గూడ నుంచి తుర్కగూడ వరకు రోడ్డును 2 కిలోమీటర్ల మేర తవ్వి వదిలేశారు. ఈ రోడ్డుపై ప్రయాణించడంతో వాహనాలు పాడై మొరాయిస్తున్నాయి. తవ్వి వదిలేసిన రోడ్డుపై రాత్రి సమయంలో ప్రయాణించాలంటే ఇబ్బందికరంగా మారింది. ముఖ్యంగా సీసీ రోడ్డుకు ఇరువైపులా తవ్వి వదిలేసిన గుంతలతో ప్రమాదం పొంచి ఉంది. అధికారులు స్పందించి రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయించాలి.

- మద్దెల శ్రీకాంత్, తుర్కగూడ

పనులు త్వరగా పూర్తి చేయాలి



ఇబ్రహీంపట్నం-కందుకూరు మండలాలను కలుపుతూ చేపట్టిన రోడ్డు విస్తరణ పనులు వేగవంతం చేయాలి. రెండు నెలల నుంచి నత్తనడకన సాగుతున్న పనులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు త్వరగా పూర్తిచేయించాల్సిన కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు పట్టించుకోని రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయించాలి.

- చాతాళ్ల జంగయ్య, సీపీఎం నాయకుడు



రాజీమార్గమే రాజమార్గం

7

ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేద్దాం

ఇబ్రహీంపట్నం, జూన్ 6 (ఆంధ్ర జ్యోతి): బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయడమేగాక, వచ్చే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సంసిద్ధులు కావాలని పార్టీ రాష్ట్ర నాయకుడు బోసుపల్లి ప్రతాప్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలో జరిగిన మండల సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. అమలు కాని ఆరు గ్యారెంటీలతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తోందని ఆరోపించారు. తొమ్మిదిన్నరేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందన్నారు. గోదల శేఖర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, అర్జున్‌రెడ్డి, దండె శ్రీశైలం యాదవ్, బాలశివుడు, శ్రీనివాస్‌రెడ్డి, విఠల్‌రెడ్డి పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూ సమస్యల పరిష్కారం


మల్లాపూర్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

» కలెక్టర్ నారాయణరెడ్డి

కొత్తూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టంలో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సుల్లో భూ సమస్యలను పరిష్కారించుకోవచ్చని కలెక్టర్ నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని మల్లాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్ పాల్గొన్ని రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. దాదాపు గంటకు అక్కడ ఉండి రైతులకు పలు సూచనలు చేశారు. సదస్సులను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహసీల్దార్ స్థాయిలో ఉండే సమస్యలను వెంటనే పరిష్కరించబడుతాయన్నారు. కార్యక్రమంలో షాద్‌నగర్ ఆర్డీవో ఎస్ఆర్ సరిత, డిప్యూటీ తహసీల్దార్ జంగయ్య, ఆర్ఐ రాంరాబు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పుస్తకాలు, యూనిఫామ్ సిద్ధంగా ఉంచాలి

రంగారెడ్డి అర్బన్ : పాఠశాలలు ప్రారంభించే వరకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్స్ విద్యార్థులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి, డీఆర్‌డీఏ పీడీ, మెప్మా పీడీ ఇతర అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు సకాలంలో యూనిఫాంలు, పుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేయాలని ఆదేశించారు. పాఠశాలు, వసతి గృహాలు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు.

తరచూ బ్రేక్ డౌన్



వికారాబాద్ ప్రభుత్వ ఆసుపత్రిలోని టీహబ్ రక్తపరీక్షల కేంద్రం



బయోకెమిస్ట్రీ మిషన్‌కు మరమ్మతు చేస్తున్న టెక్నీషియన్స్

డయాగ్నొస్టిక్ సెంటర్‌లో మొరాయిస్తున్న యంత్రాలు
16 రోజుల్లో రెండు రోజులే పనిచేసిన యంత్రం
గతంలోనూ ఇవే అవస్థలు
ప్రైవేటు కేంద్రాలను ఆశ్రయిస్తున్న రోగులు
పట్టించుకోని అధికారులు

వికారాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ డయాగ్నొస్టిక్స్ హబ్(టీహబ్) వికారాబాద్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయగా వాటి సేవలు ప్రజలకు పెద్ద తలనొప్పిగా మారాయి. ఎప్పుడూ మిషన్లు బ్రేక్ డౌన్ అవుతూ ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. మే 19న బయోకెమిస్ట్రీ మిషన్ బ్రేక్ డౌన్ కాగా తిరిగి 24, 25 తేదీల్లో పనిచేసి మళ్లీ బ్రేక్ డౌన్ అయింది. ప్రస్తుతం ఈ మిషన్‌కు మరమ్మతులు చేస్తుండగా ఎప్పుడు అందుబాటులోకి వస్తుందో తెలియడం లేదు.

40 ఆసుపత్రులకు అనుసంధానం

వికారాబాద్‌లో ఏర్పాటు చేసిన టీ హబ్‌కు రెండు జిల్లాల్లోని 40 ఆసుపత్రులను అనుసంధానం చేశారు. దీని పరిధిలో ఆలూరు, బంట్వారం, బషీరాబాద్, బొంరాస్‌పేట, చందనవెల్లి, చన్‌గోముల్, చేవెళ్ల, చిట్యాల్, దారూరు, దోమ పీహెచ్‌సీలతోపాటు కొడంగల్ సీహెచ్‌సీ, పీహెచ్‌సీలు ఉన్నాయి. అలాగే కొందుర్గు, కోట్‌పల్లి, కుల్కచర్ల, మర్పల్లి, మొయినాబాద్, మోమిన్‌పేట, నాగసముంద్ర్, నవల్గా, పరిగిలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌తోపాటు పెద్దేముల్ పీహెచ్‌సీ, పూడూరు, రామయ్యగూడ, షాబాద్, శంకర్‌పల్లి, సిద్దులూరు పీహెచ్‌సీలు ఉన్నాయి. తాండూరు డీహెచ్‌తో పాటు యూపీహెచ్‌సీ, తాండూరు ఎంసీహెచ్, తాండూరు పీహెచ్‌సీ, వికారాబాద్‌లోని కమ్యూనిటీ హెల్త్‌సెంటర్, యూపీహెచ్‌సీ ఉన్నాయి. యాలాల పీహెచ్‌సీ, తాండూరు, వికారాబాద్, కొడంగల్‌లోని బస్తీ దవాఖానాలు ఈ హబ్ పరిధిలో ఉన్నాయి.

117 రకాల పరీక్షలు.. నిలిచిన సేవలు

వికారాబాద్‌లోని టీహబ్‌లో ప్రస్తుతం 117 రకాల రక్త పరీక్షలు చేస్తున్నారు. ప్రస్తుతం 110 రకాల సేవలు అందుబాటులో ఉన్నప్పటికీ బయోకెమిస్ట్రీ సేవలు మాత్రం ప్రజలకు సరిగా అందడం లేదు. బయో కెమిస్ట్రీలో ముఖ్యంగా షుగర్ వాధిగ్రస్తులకు సంబంధించిన పరీక్షలు ఉంటాయి. అవి ప్రస్తుతం వారికి అందడం లేదు. మే 19న మిషన్ బ్రేక్ డౌన్ కాగా 24న మరమ్మతులు చేయించారు. తర్వాత రెండు రోజులు పని చేసి మళ్లీ బ్రేక్ డౌన్ అయింది. ప్రస్తుతం ఇంకా మరమ్మతులు కొనసాగిస్తుండగా ఆ సేవలు ఎప్పుడు అందుబాటులోకి వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది. బయోకెమిస్ట్రీలో ముఖ్యంగా ఎల్ఎఫ్‌టీ, ఆర్ఎఫ్‌టీ, లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్, యూరిక్ యాసిడ్ టెస్ట్, షుగర్ టెస్టులు(ఫాస్టింగ్, పోస్ట్ లంచ్), హెచ్‌బీఏ1సీ(గ్లైకేటెడ్ హిమోగ్లోబిన్), ఎలక్ట్రోలైట్స్ పరీక్షలు నిర్వహించాల్సి ఉండగా ఆ సేవలు అందడం లేదు.

ప్రైవేట్ వైపు పరుగులు

వికారాబాద్ టీహబ్‌లో పరీక్షలు జరుగకపోవడంతో ప్రజలు ప్రైవేటు వైపు వెళ్తున్నారు. ప్రైవేటులో రక్తపరీక్షలు చేసుకున్నప్పుడల్లా రూ.1,500 వరకు ఖర్చు రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. రెండు జిల్లాలకు చెందిన ప్రజలు ఈ సేవలను ఉపయోగించుకుంటున్న తరుణంలో త్వరగా మిషన్లను బాగు చేయించాలని, ప్రత్యామ్నాయంగా మిషన్లు అందుబాటులో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. టీహబ్‌లో ఉన్న ఈ మిషన్ మరమ్మతులకు గురైతే సేవలు నిలిచిపోయే పరిస్థితులు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు కొత్త మిషన్ల ఏర్పాటు విషయంలో చొరవచూపాలని ప్రజలు కోరుతున్నారు.

కేంద్రం సుపరిపాలన అందిస్తోంది



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి

వికారాబాద్/పరిగి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు కేంద్ర ప్రభుత్వం సుపరిపాలన అందిస్తుందని బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు సదానందరెడ్డి అన్నారు. శుక్రవారం పరిగిలోని శ్రీ సాయి ఒకేషనల్ జూనియర్ కళాశాలలో కేంద్ర ప్రభుత్వం 11 సంవత్సరాల సుపరిపాలన వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అవినీతి మచ్చలేకుండా పాలన సాగిస్తుందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రధాని మోదీ సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి రామచంద్రయ్య, పరిగి పట్టణ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, మండల అధ్యక్షురాలు అనసూయ, కార్యవర్గ సభ్యులు కాసుల శ్రీనివాస్, ఆంజనేయులు, హరికృష్ణ, శ్రీశైలం, వార్ల ఆంజనేయులు, మండల ప్రధాన కార్యదర్శి రమేశ్, శ్యామ్ సుందర్, రంగంపల్లి అశోక్, అనిల్‌కుమార్, కోస్గి మల్లేశ్, అంగోతు మహేందర్, కోళ్ల నరసింహ, నారాయణ పాల్గొన్నారు. వికారాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు శివరాజ్ గౌడ్, చేవెళ్ల పార్లమెంట్ జాయింట్ కన్వీనర్ అమరేందర్ రెడ్డి, నాయకులు చంద్రశేఖర్, గోపాల్, శ్రీశైలం, యాదయ్య, లింగం, రవీందర్ చారి, ఆనందం పాల్గొన్నారు.



బొడ్రాయి ప్రతిష్ఠలో మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠ

ఘట్‌కేసర్ రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఘట్‌కేసర్ మున్సిపాలిటీలోని అవుశాపూర్‌లో శుక్రవారం బొడ్రాయి ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. ఉదయం యంత్ర ప్రతిష్ఠ బలిహరణం, పూర్ణాహుతి, పండిత సన్మానం, మంగళహారతి, బొడ్రాయి ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం గ్రామ పొలిమేర చుట్టూ పొత్తి పోశారు. బొడ్రాయికి ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్‌యాదవ్, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, బొడ్రాయి కమిటీ నిర్వాహకులు, గ్రామస్థులు, మహిళలు బొడ్రాయికి నీళ్ల సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు.

పండుగలను ప్రశాంతంగా జరుపుకోవాలి

కడ్తాల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పండుగలను ప్రజలు శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని కడ్తాల సీఐ గంగాధర్ కోరారు. కడ్తాల పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఎస్ఐ వరప్రసాద్ అధ్యక్షతన శుక్రవారం శాంతి సమావేశం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ బక్రీద్‌ను ముస్లింలు ప్రశాంతంగా జరుపుకోవాలని సూచించారు. గోవుల అక్రమ రవాణా నివారణ, బందోబస్తు విషయంలో ప్రజలంతా పోలీసులకు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై చంద్రశేఖర్, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు ఆంజనేయులు, జహంగీర్‌అలీ, ఈర్షద్, జానిమీయా, మౌళిసాబ్, బాబా, లతీఫ్, మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

పని చేయకున్నా వేతనాలు!

తాండూరు బల్దియాలో ఇద్దరిని వెనుకేసుకొస్తున్న అధికారి

తాండూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తాండూరు మున్సిపాలిటీలో కొందరు సిబ్బందికి పని చేయకున్నా వేతనాలు చెల్లించడం పలు ఆరోపణలకు తావిస్తోంది. తాండూరు మున్సిపాలిటీ డంపింగ్ యార్డులో పని చేస్తున్న మురళి, నైట్ డ్యూటీ చేస్తున్న హరికృష్ణ 20 రోజులు డుమ్మా కొట్టినా వారికి పూర్తి వేతనం ఇవ్వాలని మున్సిపల్ అధికారి సంబంధిత సెక్షన్‌కు ఆదేశాలు ఇవ్వడం వివాదాస్పదమైంది. ప్రస్తుతం వీరు పని చేయడం లేదని, తమ శాఖ నుంచి ఇతర శాఖకు మార్చాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఉమేష్ గత నెల 20న స్వయంగా మున్సిపల్ కమిషనర్‌ను కోరినా వారిని మార్చకుండా అదే శాఖలో కొనసాగించడం చూస్తుంటే ఆ ఇద్దరిని వెనుకేసుకొస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. కొంత మంది సిబ్బంది, జవాన్లు నిజాయితీగా పూర్తి సమయం కేటాయించి పని చేస్తే వారికి సకాలంలో వేతనాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. కొంత మంది జవాన్లు, మున్సిపల్ శానిటరీ వర్కర్లకు పని చేయకున్నా హాజరు వేస్తున్నారు. వర్కర్ల వేతనాలు బ్యాంకు ఖాతాల్లో పడినప్పుడు వాటిని విత్‌డ్రా చేసుకునే సమయంలో కమీషన్లు తీసుకునేందుకు బ్యాంకు వద్దనే తిష్ట వేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై శానిటేషన్ విభాగానికి ఫిర్యాదులు వెళ్లడంతో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జవాన్లకు హెచ్చరికలు జారీ చేశారు. కొంతమంది సిబ్బందిని మాముళ్ల వసూళ్ల కోసం, సొంత పనుల కోసం వినియోగించుకుంటున్నట్లు మిగతా కార్మికులు ఆరోపిస్తున్నారు.


చేవెళ్ల మార్కెట్ యార్డును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శ్రీధర్

పకడ్బందీగా వంద రోజుల ప్రణాళిక

» చేవెళ్ల మున్సిపల్ ప్రత్యేకాధికారి శ్రీధర్

చేవెళ్ల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : చేవెళ్ల మున్సిపాలిటీని పచ్చదనం, పరిశుభ్రతగా తీర్చిదిద్దేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ శాఖ జాయింట్ డైరెక్టర్, చేవెళ్ల మున్సిపల్ ప్రత్యేకాధికారి పి.శ్రీధర్ పిలుపునిచ్చారు. వంద రోజుల ప్రణాళికలో భాగంగా శుక్రవారం ఆయన చేవెళ్ల మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. పట్టణంలోని కూరగాయల మార్కెట్, నర్సరీతోపాటు ప్రత్యేకంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయ భవనాన్ని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 18 వార్డులతో చేవెళ్ల కొత్త మున్సిపాలిటీగా ఏర్పడిందన్నారు. పూర్తిస్థాయి మ్యాప్ తయారు చేయడం జరిగిందన్నారు. వార్డుల ఏర్పాటుపై అభ్యంతరాలు ఉంటే మున్సిపల్ కార్యాలయంలో ఫిర్యాదు చేయాలని సూచించారు. చేవెళ్ల మున్సిపాలిటీని ఆదర్శమున్సిపాలిటీగా మార్చేందుకు వంద రోజుల ప్రణాళికను పకడ్బందీగా అమలు చేయనున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. ప్రస్తుతం సాధారణ నిధులతో పనులు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో కమిషనర్ పూర్ణచందర్, అధికారులు, సిబ్బంది ఉన్నారు.


మాట్లాడుతున్న కాటం స్వరూప

రాజీమార్గమే రాజమార్గం

» జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప

ఆమనగల్లు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజమార్గమని ఆమనగల్లు జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అన్నారు. రాజీ మార్గం ద్వారా కేసులను సత్వరం పరిష్కరించుకోవడానికి జాతీయ లోక్ అదాలత్‌లు దోహద పడుతాయని పేర్కొన్నారు. ఆమనగల్లు పట్టణంలోని కోర్టు ఆవరణలో ఈనెల 14న నిర్వహించే లోక్ అదాలత్ కార్యక్రమంపై అధికారులతో సమావేశం నిర్వహించారు. జూనియర్ సివిల్ జడ్జి కాటం స్వరూప అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమనగల్లు, కడ్తాల, మాడ్గుల, తలకొండపల్లి మండలాల పోలీస్, ఎక్సైజ్ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఆయా మండలాల పరిధిలోని పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను ఆమె అడిగి తెలుసుకున్నారు. లోక్ అదాలత్ గురించి కక్షిదారులకు సమాచారం అందించి ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చూడాలని సూచించారు. కక్షిదారులు సమయం, డబ్బు వృథా చేసుకోకుండా రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో ఏపీపీ కార్తీక్, సీఐలు జానకీరామ్ రెడ్డి, గంగాధర్, ఎక్సైజ్ సీఐ బద్యనాథ్, ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి ఎస్ఐలు వెంకటేశ్, శ్రీకాంత్, వరప్రసాద్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.


శామీర్‌పేట కొనుగోలు కేంద్రం ఎదుట ఆందోళన చేస్తున్న రైతులు

గన్నీ బ్యాగుల కొరత.. రైతుల ఆందోళన

శామీర్‌పేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గన్నీ బ్యాగుల కొరతతో రైతులు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. శామీర్‌పేట రైతు సహకార సంఘంలో జిల్లా సివిల్ సప్లయ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రానికి ధాన్యం తరలించేందుకు రైతులకు కావాల్సిన గోనె సంచులను నిర్వాహకులు అందించలేదు. ఈ కేంద్రంలో 8,000 వేల గోనె సంచులు అవసరం ఉండగా 2,400 మాత్రమే అందుబాటులో ఉండడంతో ఆ సంచులను ఏ రైతుకు ఇవ్వాలో తెలియని పరిస్థితి ఏర్పడింది. దీంతో శుక్రవారం కొనుగోలు కేంద్రం ఎదుట రైతులు ఆందోళన చేశారు.


వివరాలు తెలుసుకుంటున్న సీపీ అవినాష్ మహంతి

పోలీస్ స్టేషన్ ఆకస్మిక తనిఖీ

కేశంపేట జూన్ 6(ఆంధ్రజ్యోతి): కేశంపేట పోలీస్ స్టేషన్‌ను సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి శుక్రవారం రాత్రి ఆకస్మికంగా తనిఖీ చేశారు. శంషాబాద్ డీసీపీ రాజేశ్, శంషాబాద్ అడిషనల్ డీసీపీ పూర్ణచందర్, షాద్‌నగర్ ఏసీపీ లక్ష్మీనారాయణతో కలిసి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్లో రికార్డులను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. నేరాల నియంత్రణలో పోలీసుల పాత్ర ఎంతగానో ఉంటుందని తెలిపారు. నేర నియంత్రణలో భాగంగా ప్రజలతో మమేకమై ఉండాలని సూచించారు. అలాగే స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఉన్న సమస్యలను స్థానిక పోలీస్ కానిస్టేబుల్ లను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటు లో ఉండి వారి సమస్యలను పరిష్కరించాలని సీఐ నరహరి, ఎస్సై రాజ్ కుమార్‌కు సూచించారు.

మున్సిపల్ సిబ్బందికి వైద్య పరీక్షలు


మున్సిపల్ సిబ్బందికి చికిత్స చేస్తున్న వైద్యులు

శంషాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి చేపట్టిన 100 రోజుల యాక్షన్ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా శంషాబాద్ మున్సిపాలిటీలోని వివిధ శాఖల్లో పనిచేస్తున్న సిబ్బందికి శుక్రవారం శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలోని మహిళామండలి ప్రాంగణంలో వైద్య శిబిరం నిర్వహించారు. రక్తపోటు, బ్లడ్ షుగర్, థైరాయిడ్ తదితర వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ శిబిరంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సుష్మామహేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ సంజయ్‌యాదవ్, కమిషనర్ సుమన్‌రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య పాల్గొన్నారు.

గ్రామీణ పేదరిక నిర్మూలనే లక్ష్యం

పరిగి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేదరిక నిర్మూలనే లక్ష్యంగా ర్యాంప్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నట్లు పరిశ్రమల శాఖ జీయం మహేశ్వర్ అన్నారు. పరిగి మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాంప్ ప్రోగ్రాం నిర్వహించారు. రైజింగ్ అండ్ యాక్సిలరేటింగ్, ఎంఎస్ఎంఈఈ పెర్ఫార్మెన్స్ ర్యాంప్ అనేది ప్రపంచ బ్యాంకు నిధులతో సూక్ష్మ, చిన్న మధ్య తరహా పరిశ్రమల పరిపుష్టి చేయనున్న పథకమని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎల్ఈఏపీ యంసీ సభ్యురాలు కవితా రాజేశ్, ఏపీయం శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న జీఎం మహేశ్వర్

కొత్లాపూర్ ఎల్లమ్మకు ప్రత్యేక పూజలు



తాండూరు రూరల్, జూన్ 6, (ఆంధ్రజ్యోతి): కొత్లాపూర్ రేణుకా ఎల్లమ్మ ఆలయ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. నాలుగో శుక్రవారం కర్ణాటక ప్రాంతం నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం భక్తులతో సందడిగా మారింది. పూజల్లో భాగంగా ప్రధాన ఘట్టాలు ముగియడంతో నిర్వాహకులు, పోలీసులు ఊపిరి పీల్చుకున్నారు. ఎస్ఐ విఠల్‌రెడ్డి ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ నవీన్‌రెడ్డి, దేవాదాయ శాఖ ఈవో శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచ్ బుడ్డెల్లి సాయిలు భక్తులకు ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేశారు. ఆలయ పూజారి శ్రీనివాస్ పంతులు, ప్రతినిధులు రవి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈనెల 11న పౌర్ణమితో ఉత్సవాలు ముగుస్తాయని ఆలయ కమిటీ చైర్మన్, ఈవో శేఖర్‌గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు బైండ్ల రాజు, లాలయ్య గౌడ్, లల్లానాయక్, శాంతప్ప, చెవిటి లక్ష్మి, ప్రవీణ్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

యథేచ్ఛగా బెల్లం అమ్మకాలు

» గుడుంబా తయారీదారులకు ఊతం

» ఓ ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకుడి అండదండలతో దిగుమతి

» ఆమనగల్లులో దుకాణాలకు గుట్టుగా సరఫరా



ఆమనగల్లు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): గుడుంబా రహిత తెలంగాణ దిశగా ప్రభుత్వం ఎక్సైజ్ శాఖ ద్వారా పకడ్బందీ చర్యలు తీసుకుంటుంటే ఆమనగల్లులో అందుకు భిన్నంగా బెల్లం వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. దీంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరే పరిస్థితి కనిపించడం లేదు. స్థానిక ఎక్సైజ్ అధికారులు నాటుసారా నిరోధం, బెల్లం నిరోధానికి చర్యలు చేపడుతుంటే మరో వైపు కొందరు వ్యాపారులు వాటిని ప్రోత్సహించేలా వ్యవహరిస్తున్నారు. బెల్లం విక్రయాల కారణంగానే మళ్లీ గుడుంబా తయారీ సాగుతుందన్న విమర్శలు ఉన్నాయి. హైదరాబాద్ నుంచి ఓ ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకుడు పెద్ద ఎత్తున బెల్లం దిగుమతి చేసుకొని దుకాణాలకు సరఫరా చేస్తున్నాడు. కొందరు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి బెల్లాన్ని దుకాణాల వారీగా సరఫరా చేస్తూ అందినకాడికి దండుకుంటున్నారన్న ఆరోపణలున్నాయి. ఎక్సైజ్ అధికారుల కండ్లు గప్పి బెల్లం అక్రమ వ్యాపారం చీకటి వేళ కొనసాగిస్తున్నారు. రోజూ పెద్దఎత్తున బెల్లం ఆమనగల్లులో సరఫరా, విక్రయాలు జరుగుతున్నాయని సమాచారం. బెల్లం వ్యాపారుల మూలంగానే ప్రభుత్వ లక్ష్యం నీరు గారుతుందని పలువురు స్థానికులు వాపోతున్నారు.

గుట్టుచప్పుడు కాకుండా..

ట్రాన్స్‌పోర్ట్ ముసుగులో బెల్లం దందా జోరుగా కొనసాగుతున్నది. పొరుగుప్రాంతాలకు కూడా సదరు ట్రాన్స్‌పోర్ట్ నిర్వాహకుడే బెల్లం సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఎక్సైజ్ అధికారులు మొక్కుబడిగా తనిఖీలు నిర్వహిస్తుండటంతో బెల్లం విక్రయాలు ఇటీవల అధికమైనట్లు ఫిర్యాదులు ఉన్నాయి. హైదరాబాద్‌కు చేరువలో ఉన్న ఆమనగల్లుకు కొందరు వ్యాపారులు కార్లు, ఇతర వాహనాల్లో బెల్లం దిగుమతి చేసుకొని గుడుంబా తయారు చేసే వారికి గుట్టు చప్పుడు కాకుండా సరఫరా చేస్తున్నట్లు సమాచారం. తెల్లబెల్లం చాటున నల్లబెల్లం, నవసాగరం, పటిక కూడా దుకాణాలలో జోరుగా విక్రయిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చిన్నచిన్న వాటికి హడావిడి చేసే ఎస్ఓటీ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బెల్లం విక్రయాలను అరికట్టడం పై దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది. పండగలు, శుభకార్యాల సమయంలో కిరాణ షాపుల్లో ఒకటి రెండు కిలోల బెల్లం విక్రయానికి కూడా అనుమతులు తీసుకోవాలంటున్న సంబంధిత అధికారులు పెద్దమొత్తంలో దిగుమతి చేసుకుంటున్న సిండికేట్ వ్యాపారులపై చర్యలు తీసుకోకపోవడంతో అనుమానాలకు తావిస్తుంది. ఏదిఏమైనా ఆమనగల్లు ప్రాంతంలో బెల్లం వ్యాపారానికి అడ్డుకట్ట వేయకపోతే గుడుంబా వాసన గుప్పుమనే అవకాశం లేకపోలేదని పలువురు పలు విధాలుగా చర్చించుకుంటున్నారు.

ప్రత్యేక నిఘా పెట్టాం



ఆమనగల్లు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో బెల్లం విక్రయాలపై నిఘా పెట్టాం. నిబంధనలు అతిక్రమించిన పలువురు వ్యాపారులపై కేసులు నమోదు చేసి తహసీల్దార్ల ఎదుట బైండోవర్ చేశాం. నల్లబెల్లం, తెల్ల బెల్లం ఏదైనా పరిమితికి మించి నిల్వ ఉంటే కేసులు నమోదు చేస్తున్నాం. ట్రాన్స్‌పోర్ట్ వాహనాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తున్నాం.

- బద్యనాథ్ చౌహాన్, ఎక్సైజ్ సీఐ, ఆమనగల్లు


ఎన్‌సీసీ కార్యాలయాన్ని సీఎస్ రావుతో కలిసి ప్రారంభిస్తున్న సాత్విక రెడ్డి

ఎన్‌సీసీతో దేశభక్తి, క్రమశిక్షణ

మొయినాబాద్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దేశభక్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు పెంపొందేందుకు ఎన్‌సీసీ వేదికని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ చీఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ సాత్వికరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని చైతన్య డీమ్డ్ యూనివర్సిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎన్‌సీసీ కార్యలయాన్ని అ సంస్థకు చెందిన కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ సీఎస్ రావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఎస్‌సీసీ దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో మేజర్ రేవతి ప్రభాకరన్, కెప్టెన్ డాక్టర్ కవిత, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమంలా మట్టి గణపతులను అందిద్దాం

» తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


'మట్టిగణపతి.. మహా గణపతి' పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

తాండూరు/తాండూరు రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): తాండూరు ప్రాంతంలో ఈ ఏడాది వినాయక చవితి పండుగకు పది వేల మట్టి గణపతులను ఉద్యమంలా అందిద్దామని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హిందూ సంఘటన ఆధ్వర్యంలో రూపొందించిన 'మట్టి గణపతి - మహా గణపతి' వాల్ పోస్టర్‌ను డీఎస్పీ బాలకృష్ణరెడ్డితో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ పంపిణీ చేసేందుకు మట్టి గణపతి విగ్రహాలను తయారు చేయించాలని ఇన్‌చార్జి కమిషనర్‌ను ఆదేశించారు. కుల్కచర్లలో మట్టి విగ్రహాలను తయారుచేస్తున్న వారితో ఎమ్మెల్యే మాట్లాడారు. కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి, హిందూ ఉత్సవ కేంద్ర సమితి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల నర్సింహులు, హిందూ సంఘటన్ ప్రతినిధులు గాజుల బస్వరాజ్, పర్యాద రామకృష్ణ, రజనీకాంత్, గీత సత్సంగ్ ప్రతినిధులు సిద్ధార్థ, నరేందర్, పటేల్ విజయ్‌కుమార్, వేణు, చల్లా నారాయణ, ఆర్య సమాజ్ ప్రతినిధులు సంతోష్, దేవగారి రమేష్, బీసీ సంఘం నాయకుడు రాజ్ కుమార్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు భోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం తాండూరు పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పాఠశాలలో మధ్యాహ్న భోజనం పథకంలో భాగంగా వంట పాత్రలను అందజేశారు. నియోజకవర్గ పరిధిలోని 256 ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి వంట పాత్రలను ఏజెన్సీ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను ఎంఈవో వెంకటయ్య సన్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాల్‌రెడ్డి, డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్‌గౌడ్, నోడల్ అధికారి హరిశ్చందర్, ఎంఈవో వెంకటయ్య, కాంగ్రెస్ నాయకులు నర్సింహులు, హరీశ్‌రెడ్డి, హబీబ్‌లాలా, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పూజలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, బాలాజీసింగ్ తదితరులు

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం పాలన సాగిస్తుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆమనగల్లు, కడ్తాల్, వెల్దండ మండలాల పరిధిలో శుక్రవారం పర్యటించారు. పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేశారు. స్థానిక నాయకులతో కలిసి ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేశారు. వీరనాగమ్మ ఆలయంలో జరిగిన పూజల్లో పాల్గొన్నారు. ఆయా చోట్ల జరిగిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి, పేదరిక నిర్మూలనకు సీఎం రేవంత్ రెడ్డి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటున్నారని పేర్కొన్నారు. ఆయన వెంట విద్యా కమిషన్ సభ్యుడు చారగొండ వెంకటేశ్, పీసీసీ అధికార ప్రతినిధి బాలాజీసింగ్, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస‌గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యాట నర్సింహ, విజయ్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షులు బీచ్యనాయక్, మానయ్య, జగన్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, నాయకులు వెంకటయ్య, మోతిలాల్, పర్వత్‌రెడ్డి, విజేందర్‌గౌడ్, రామకృష్ణ, రామస్వామి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

విద్యా సంస్థల్లో సౌకర్యాలు కల్పించాలి

కేశంపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యా సంస్థల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని కేశంపేట ఇన్‌చార్జి ఎంపీడీవో కిష్టయ్య అన్నారు. ఈ నెల 12న పాఠశాలలు తెరుచుకోనున్న నేపథ్యంలో కనీస సౌకర్యాల కల్పనపై ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ సూపర్ వైజర్లతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో తాగునీరు, విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. పాఠశాలలను శుభ్రపరచాలన్నారు. ఇన్‌చార్జి ఎంఈవో చంద్రశేఖర్, ఏఈ ప్రదీప్ పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ విగ్రహ ప్రతిష్ఠ


హనుమాన్ విగ్రహ, ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నందిగామ/చౌదరిగూడ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని శ్రీనివాసులగూడలో హనుమాన్, వినాయకుడు, ధ్వజస్తంభ ప్రతిష్ఠను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా హోమాలు, యజ్ఞాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతిష్ఠ కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, ఇతర నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా దేవాలయ కమిటీ సభ్యులు అతిథులను ఘనంగా సన్మానించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. అక్కడి నుంచి ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని రావిర్యాల పంచాయతీలోని వీరసముద్రం గ్రామంలో కొనసాగుతున్న దేవతా మూర్తుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి, నాయకులు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, మురళీయాదవ్, ఈట గణేష్, జంగ నర్సింహులు, మామిళ్ల విఠల్, గొర్లపల్లి అశోక్, నవీన్‌గౌడ్, దర్శన్, సతీష్, గోపాల్‌రెడ్డి, శంకరయ్య, నర్సింహులు, కాట్న శ్రీశైలం, రవీందర్, శివచారి, కృష్ణయ్య, రామ్‌రెడ్డి, రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, మాదవరెడ్డి, మల్లేష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.


డిగ్రీ పట్టాలు పొందిన విద్యార్థులతో అధ్యాపకులు

ఫార్మసీకి ఉజ్వల భవిష్యత్తు

ఘట్‌కేసర్, జూన్6 (ఆంధ్రజ్యోతి): ఫార్మసీ రంగానికి ఉజ్వల భవిష్యత్ ఉందని కామినేని అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్, రీసెర్చ్ సెంటర్ సూపరింటెండెంట్ డాక్టర్ కనుసాలీ అంజయ్య అన్నారు. శక్రవారం ఘట్‌కేసర్ పరిధిలోని కొండపూర్‌లోని సంస్కృతి ఫార్మసీ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ కొత్త ఔషధాల రూపకల్పనలో సైడ్ ఎఫెక్ట్స్ లేని ఫార్ములేషన్ల రూపకల్పనకు అధిక ప్రధాన్యం ఉందన్నారు. కార్యక్రమంలో సంస్కృతి విద్యా సంస్థల చైర్మన్ ఏవీ రమాణరెడ్డి, డైరెక్టర్ డాక్టర్ మల్లాది రమాకాంత్ రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కొండా శ్రవణ్ కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్రీమ్‌బన్‌లో సిగరెట్ ముక్క



ధారూరు, జూన్6(ఆంధ్రజ్యోతి): ఓ బేకరీలో కొనుగోలు చేసిన క్రీమ్ బన్‌లో సిగరెట్ ముక్క ఉండటంతో కొనుగోలుదారులు అవాక్కయ్యారు. ఈ సంఘటన వికారాబాద్ జిల్లా ధారూరులోని శుక్రవారం జరిగింది. ధారూరు చౌరస్తాలోని ఓ బేకరిలో ఇద్దరు వినియోగదారులు 4 క్రీమ్ బన్‌లను కొనుగోలు చేసి ఇంటికి తీసికెళ్లారు. తినడానికి విప్పితే అందులో సిగరెట్ ముక్క కనిపించింది. ఈ క్రీమ్ బన్‌ను తీసుకువచ్చి బేకరి యజమానిని ప్రశ్నిస్తే నిర్లక్ష్యంగా సమాధానమిచ్చాడని వారు వాపోయారు. బేకరీని సంబంధిత అధికారులు తనిఖీ చేసి యజమానిపై చర్యలు తీసుకోవాలని కోరారు.


చికెన్ షాప్‌ను సీజ్ చేస్తున్న మున్సిపల్ అధికారులు

మేడ్చల్‌లో చికెన్ షాపుల సీజ్

మేడ్చల్ టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) నిబంధనలకు విరుద్ధంగా చికెన్ అమ్ముతున్న రెండు దుకాణాలను మేడ్చల్ మున్సిపల్ అధికారులు శుక్రవారం సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ సిబ్బంది పలు చికెన్ షాపులను, ఫాస్ట్‌ఫూడ్ సెంటర్లను తనిఖీ చేశారు. నిర్వాహకులు దుకాణాల వద్ద నిబంధనలకు విరుద్ధంగా చికెన్ నిల్వ చేసి విక్రయాలు జరుపుతునట్టు పరిశీలనలో తేలడంతో రెండు చికెన్ షాపులకు తాళం వేశారు. శుభ్రత పాటించని, చికెన్ నిల్వ చేసిన పలు ఫాస్ట్ ఫూడ్ సెంటర్లకు నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ నాగిరెడ్డి మాట్లాడుతూ.. నిబంధనలకు వ్యతిరేకంగా చికెన్ షాపులు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

పశువులకు టీకాలు వేయించాలి

మొయినాబాద్ రూరల్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పశువుల్లో లంపీ స్కీన్ వ్యాధి(ముద్దు చర్మం వ్యాధి) వ్యాప్తి చెందకుండా ప్రభుత్వం ఇస్తున్న టీకాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి డాక్టర్ దేవిరెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని అమ్డాపూర్ గ్రామంలో పాడి పశువులకు టీకాలు వేసే కార్యక్రమంలో ఆమె పాల్గొని టీకాలు వేశారు. పాడి రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.



మండల విద్యాధికారికి వినతిపత్రం ఇస్తున్న బాల్‌రాజ్

మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం అందించాలి

కందుకూరు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజన కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని, మధ్యాహ్న భోజన పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు సంస్థకు అప్పజెప్పడాన్ని వెంటనే విరమించుకోవాలని సీఐటీయూ మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విద్యావనరుల కేంద్రం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా చేపట్టారు. అనంతరం ఎంఈవో నరసింహకు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం ఇచ్చారు. గత 23 సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు వంట చేసి పేద విద్యార్థుల కడుపు నింపుతున్న వారికి కనీస వేతనాన్ని ఇవ్వాల్సిన ప్రభుత్వం, నేడు ప్రవేటు సంస్థకు అప్పజెప్పడం ఏమిటని ప్రశ్నించారు. కార్మిక సంఘం నేతలు ప్రభావతి, శ్రీనివాస్, ఆండాలు, బాలమణి, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌ఎంఎంఎస్ ఉపకార వేతనాలకు కుర్మిద్ద పాఠశాల బాలికల ఎంపిక

యాచారం, జూన్ 6(ఆంధ్రజ్యోతి): యాచారం మండలంలోని కుర్మిద్ద పాఠశాలకు చెందిన ఇ రువురు బాలికలు నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు పాఠశాలకు చెందిన మేఘన, మనీషలు ఎంపికయ్యారని పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్తు పాండురంగారెడ్డి ఒ క ప్రకటనలో తెలిపారు. వీరు ఇంటర్‌మీడియట్ పూర్తయ్యే వరకు నాలుగేళ్లకు ఒ క్కో బాలికకు రూ. 48వేల ఉపకారవేతనాలు అందుతాయని ఆయన చెప్పారు. తమకు ఎన్‌ఎంఎంఎస్‌కు ఎంపికకావడంలో పాఠశాల ఉపాధ్యాయుల సహకారం ఉందని బాలికలు తెలిపారు.

అట్టహాసంగా ఆచారి జన్మదిన వేడుకలు



ఆమనగల్లులో కేక్ కట్ చేస్తున్న తల్లోజు ఆచారి



ఆచారిని గజమాలతో సత్కరిస్తున్న బీజేపీ నాయకులు

ఆమనగల్లు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు, బీజేపీ రాష్ట్ర నాయకుడు తల్లోజ ఆచారి జన్మదిన వేడుకలు ఆమనగల్లు పట్టణం, కడ్తాల, తలకొండపల్లి మండల కేంద్రాల్లో శుక్రవారం అట్టహాసంగా జరిగాయి. బీజేపీ మండలాధ్యక్షులు కర్నాటి విక్రమ్‌రెడ్డి, ఎర్రవోలు శ్రీను, దోనాదుల మహేశ్, రవిగౌడ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. కడ్తాల, ఆమనగల్లులో బీజేపీ శ్రేణులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయా చోట్ల బీజేపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఆచారి కేకులు కట్ చేసి ప్రజలకు పంచిపెట్టారు. బాణసంచా పేల్చి మిఠాయిలు పంచారు. ఆచారిని గజమాలలతో సత్కరించి బీజేపీ నేతలు అభిమానం చాటుకున్నారు. పలుచోట్ల ఆచారి మొక్కలు నాటారు. బీజేపీ నాయకులు పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర, జిల్లా, మండలాల నాయకులు కండె హరిప్రసాద్, చెక్కాల లక్ష్మణ్, గోరటి నర్సింహ, వీరయ్య, సాయిలాల్, మన్యనాయక్, రాందాస్ నాయక్, శంకర్‌నాయక్, రాంపాల్ నాయక్, చెన్నకేశవులు, కృష్ణనాయక్, పాష, శ్రీధర్, రవిరాథోడ్, శ్రీనివాస్, పద్మ ప్రశాంత్, సందీప్, మొక్తాల వెంకటయ్య, జానయ్య, విష్ణు, భగవాన్‌రెడ్డి, మహేశ్, శ్రీశైలం, టిల్లు యాదవ్, శివరామ్, నరేందర్, నరేశ్, బక్కి కుమార్, భగీరథ్, యాదగిరి, రెడ్యానాయక్, జంగం వెంకటేశ్, శ్రీశైలం, పాండు ప్రసాద్, మహేశ్, అనిల్, రాజు, పెద్దయ్యయాదవ్, కాసుల వెంకటేశ్, దండు శ్రీను, వెంకటయ్య, సీతారామరాజు, తదితరులు పాల్గొన్నారు.

యోగా చేద్దాం.. ఆరోగ్యంగా ఉందాం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్ అర్బన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు నిత్యం యోగా చేసి ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ యోగా డే పోస్టర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించి, మాట్లాడారు. మనిషికి ఆరోగ్యానికి మించిన ఆస్తి మరొకటి ఉండదని, ఆరోగ్య పరిరక్షణ కోసం యోగ సాధన అమృతంలా పనిచేస్తుందన్నారు. అంతర్జాతీయ యోగ దినోత్సవం రోజు ప్రతీఒక్కరు యోగ సాధనలో పాల్గొని ప్రజల్లో అవగాహనను పెంచాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. డాక్టర్ జి.షీలా, డాక్టర్ జయప్రకాష్, హెల్ ఎడ్యూకేటర్ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకులు చెంది తిరుపతిరెడ్డి, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదల సొంతింటి కల సాకారం

చౌదరిగూడ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సొంతింటి కల సాకారం కాంగ్రెస్ పార్టీతో నేరవేరుతుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఇంద్రనగర్, రావిర్యాల, గుర్రంపల్లి గ్రామాల్లో లబ్ధిదారుల ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే కొందుర్గు మండల పరిధిలోని టేకులపల్లి, పర్వతాపూర్, చిన్నఎల్కిచర్ల గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసి లబ్ధిదారులకు ప్రొసిడింగ్‌లు అందజేశారు. కాంగ్రెస్ మండలాధ్యక్షులు కృష్ణారెడ్డి, రాజు, పురుషోత్తంరెడ్డి, జితేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో ఇంటర్ అడ్మిషన్లు

- ఈ ఏడాది నుంచి ఎంపీసీ, బైపీసీ గ్రూపులు
- ఒక్కో గ్రూపులో 40 సీట్లు
- మొదటి సంవత్సరానికి అడ్మిషన్లు ప్రారంభం



ఆమనగల్లు కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయం

ఆమనగల్లు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బాలికల విద్యాభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల స్థాయిని పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈమేరకు కేజీబీవీలకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పదో తరగతి అనంతరం విద్యార్థినీల ఉన్నత చదువులకు ఆటంకం కలుగకుండా, ఆర్థిక, దూరభారం లేకుండా ఇంటర్ తరగతుల ప్రారంభానికి విద్యాశాఖ శ్రీకారం చుట్టింది. ఈ క్రమంలో ఆమనగల్లు కేజీబీవీలో ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశం పెందుటకు అడ్మిషన్ల స్వీకరణకు అధికారులు చర్యలు చేపట్టారు.

కాగా, ఆమనగల్లు పట్టణంలో 2006లో కేజీబీవీని ప్రారంభించారు. అద్దె భవనంలో పాఠశాలను ఏర్పాటుచేసి అనంతరం విశాల నూతన భవనాన్ని నిర్మించారు. ప్రతీయేటా తరగతుల సంఖ్యను పెంచారు. ప్రస్తుతం ఆరు నుంచి పదో తరగతులు కొనసాగుతున్నాయి. ప్రస్తుతం ఐదు తరగతులలో 230 మంది విద్యార్థినీలు ఉన్నారు. పదో తరగతిలో ప్రతీఏటా కేజీబీవీ విద్యార్థినీలు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ వస్తున్నారు. 2025-26లో కేజీబీవీని ప్రభుత్వం అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. ఈఏడాది ఇంటర్ ఫస్టియర్ ప్రారంభ కానుంది.

ఒక్కో గ్రూపులో 40 సీట్లు

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం ఎంపీసీ, బైపీసీ గ్రూపులు తెలుగు, ఆంగ్ల మాధ్యమంలో ప్రారంభం కానున్నాయి. కాగా, ఒక్కో గ్రూప్‌లో 40 సీట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కేజీబీవీలను అప్‌గ్రేడ్ చేస్తూ ఇంటర్ తరగతులు ప్రారంభిస్తుండడంతో పేద విద్యార్థినీలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమకు ఉన్నత విద్యకు ఇబ్బందులు ఉండవని వారు భావిస్తున్నారు.

గెస్ట్ లెక్చరర్లకు ఆహ్వానం

ఆమనగల్లు కేజీబీవీలో ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రారంభం నేపథ్యంలో గెస్ట్ లెక్చరర్‌లను డెమో నిర్వహించిన అనంతరం తీసుకుంటున్నా రు. ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీ కరిస్తున్నారు. బోధనకు ఇబ్బంది లేకుండా ప్రభు త్వం చర్యలు చేపట్టింది. బోటనీ, తెలుగు, ఆంగ్లం, బయాలజీ, జువాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్, మ్యాథ్స్ బోధించుటకు ఆసక్తిగల మహిళా అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు పేర్కొన్నారు.

దరఖాస్తుల స్వీకరిస్తున్నాం



ఆమనగల్లు కేజీబీవీలో ఈ ఏడాది నుంచి ఇంటర్ తరగతులు ప్రారంభిస్తాం. దాంతో పదో తరగతి పూర్తిచేసిన విద్యార్థినీలకు సౌకర్యంగా, చదువు మధ్యలో ఆగకుండా ఉంటుంది. ఇంటర్ ప్రథమ సంవత్సరం బైపీసీ, ఎంపీసీ గ్రూపులకు అడ్మిషన్లు స్వీకరిస్తున్నాం. నిరుపేద బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

- వద్యజ్యోతి , ఎస్వో, ఆమనగల్లు

ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

చౌదరిగూడ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి బడులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని రావిర్యాల ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసి బడిబాట కార్యక్రమం వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు పాఠ్యపుస్తకాలను అందజేశారు. హెచ్‌ఎం రాములు, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు రాజు, జితేందర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, వెంకట్‌నర్సింహారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, సురేందర్, నీలయ్య, భాస్కర్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

చౌదరిగూడ : ప్రైవేట్ బడులకు దీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఉత్తమంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జీహెచ్‌ఎం సునీత అన్నారు. జిల్లేడ్ చౌదరిగూడ, కొందుర్గు మండల కేంద్రాల్లోని ఉన్నత పాఠశాలల్లో బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామ సభలు నిర్వహించారు. టీచర్లు, నాయకులు ఏజాజ్ అలీ, మచ్చ సుధాకర్‌రావు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మహేశ్వరం : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన నాణ్యమైన విద్యందిస్తుందని



శంకర్‌పల్లి : బడిబాట కార్యక్రమంలో టీచర్లు



కందుకూరు : తిమ్మాపురంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, చిన్నారులు

మండల విద్యాధికారి కస్నానాయక్ అన్నారు. తుమ్మలూరులో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. గ్రామస్థులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకర్‌పల్లి : ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని కొండకల్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జీవనజ్యోతి తెలిపారు. పాఠశాలలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి పిల్లల తల్లిదండ్రులతో సమావేశమయ్యారు. ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లోనే చేరాలని, ప్రభుత్వం మెరుగైన విద్యతో పాటు మౌలిక వసతులు, ఉచితంగా పాఠ్యపుస్తకాలు, దుస్తులను అందిస్తుందని తిమ్మాపురం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. తిమ్మాపురంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. తిమ్మాపురం ఉన్నత పాఠశాల పరిధిలోని మాదాపురం, బేగంపేట, జబ్బార్‌గూడ, గ్రామాలకు చెందిన విద్యార్థులు అధిక సంఖ్యలో పాఠశాలలో చేరాలన్నారు. అంబేడ్కర్ సేవా సమి తి సభ్యులు మంద యాదగిరి, మంద రవి, మం ద మహేష్, గ్రామస్థులు తదితరులున్నారు.

శంషాబాద్ : సర్కారు బడుల్లో చదువుతున్న విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు వర్క్‌బుక్‌లను మండల వనరుల కేంద్రం వద్ద ఎంఈవో లక్ష్మణ్ నాయక్ పంపిణీ చేశారు. మండలంలోని ప్రైవేటు స్కూళ్ల యాజమాన్యాలు అధిక ఫీజులు వసూలు చేయొద్దని ఎంఈవో హెచ్చరించారు.

చేవెళ్ల : ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందుతుందని చేవెళ్ల మండల విద్యాధికారి పురందాస్ తెలిపారు. మండల పరిధిలోని ఊరెళ్ల పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఎంఈవో పురందాస్, పలువురు ఉపాధ్యాయులతో కలిసి పోస్టర్ ఆవిష్కరించి ప్రారంభించారు. ఆయా పాఠశాలల ఉపాధ్యా యులు, తదితరులు పాల్గొన్నారు.

యాచారం : బడీడు పిల్లలను బడిలో చేర్పించడానికి ప్రతీఒక్కరు చొరవ తీసుకోవాలని ఎంఈవో పాండురంగారెడ్డి అన్నారు. మండల విద్యావనరుల కేంద్రంలో వివిధ గ్రామాల ఉపాధ్యాయులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు.



చేవెళ్ల : పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎంఈవో పురందాస్



శంషాబాద్ : పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈవో లక్ష్మణ్‌నాయక్, సిబ్బంది

'భూ భారతి'తో సమస్యలకు శాశ్వత పరిష్కారం

నందిగామ, జూన్ 6(ఆంధ్రజ్యోతి): భూభారతి చట్టంతో భూ సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని, రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని అప్పారెడ్డిగూడలో తహసీల్దార్ రాజేశ్వర్ అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. జంగ నర్సింలు, అశోక్ రెడ్డి, సత్యనారాయణ, సీతారాములు, మల్లేష్, ప్రతాప్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : ఇన్ముల్‌నర్వలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ రవీందర్‌రెడ్డి దరఖాస్తులు స్వీకరించారు. ఇన్ముల్‌నర్వలో 23 దరఖాస్తులు, మల్లాపూర్‌లో 34 రాగా 28 పరిష్కరించారు. ఆర్ఐ సంజీవ, సిబ్బంది పాల్గొన్నారు.

షాద్‌నగర్ రూరల్ : బీఆర్‌ఎస్ హయాంలో ధరణిలో పట్టా భూములను లావణి భూములుగా నమోదు చేశారని, వాటిని పరిశీలించి తిరిగి పట్టా భూములుగా నమోదు చేయాలని రైతులు అధికారులను కోరారు. ఫరూఖ్‌నగర్ మండలం కిషన్‌నగర్, గుండ్లకుంట, తిమ్మాజిపల్లిలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ పార్థసారథి, డీటీ ఆనంద్‌సింగ్ దరఖాస్తులు స్వీకరించారు. బూర్గుల రెవెన్యూ పరిధిలోని కడియాలకుంట తాండ పరిధిలోని కొన్ని సర్వేనెంబర్లు లావణి భూములుగా బీఆర్‌ఎస్ హయాంలో నమోదు చేశారని పలువురు రైతులు డీటీ ఆనంద్‌సింగ్‌కు వినతి పత్రం ఇవ్వగా రికార్డులను పరిశీలించి మార్పులు చేస్తామని హామీ ఇచ్చారు.



యాచారం : ఇళ్ల స్థలాలు కేటాయించాలని తహసీల్దార్‌కు వినతిపత్రమిస్తున్న చింతపట్ల గ్రామస్థులు

యాచారం : చింతపట్లలో జరిగిన రెవెన్యూ సదస్సులో తహసీల్దార్ టి.అయ్యప్ప రైతులనుద్దేశించి మాట్లాడారు. భూ తగాదాలతో ఘర్షణలకు పాల్పడకుండా సమస్యలను వివరిస్తే పరిష్కరిస్తామన్నారు. కాగా, చింతపట్లలో 200, మల్కీజ్‌గూడలో 93 దరఖాస్తులందాయని తహసీల్దార్ చెప్పారు.

కాగా, చింతపట్లలో ఇళ్లు లేని పేదలందరికీ ప్రభుత్వం కొనుగోలు చేసిన భూమిలో ఇంటి స్థలాలతో పాటు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి ఆదుకోవాలని సీపీఎం నాయకులు జంగయ్య, శేఖర్‌లు తహసీల్దార్‌కు సమర్పించిన వినతిపత్రంలో కోరారు. సీపీఎం నాయకులు తదితరులున్నారు.

ఆమనగల్లు : తహసీల్దార్ లలిత చెన్నంపల్లిలో ఫిర్యాదులు స్వీకరించారు. పరిష్కరిస్తామన్నారు. డీటీ సంపత్, ఆర్ఐ చెన్నకేశవులు పాల్గొన్నారు.

చేవెళ్ల : చేవెళ్ల, ఇబ్రహీంపల్లిలో సదస్సులు నిర్వహించారు. తహసీల్దార్ బి.కృష్ణయ్య ఫిర్యాదులు స్వీకరించారు. డిప్యూటీ తహసీల్దార్లు రాజశేఖర్, రాజేంద్ర, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నత్తేనయం!

(ఐదో పేజీ తరువాయి)

ధూళి చెలరేగి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పనుల నిర్వహణపై ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. రాత్రి సమయంలో తవ్వి వదిలేసిన రోడ్డుపై చర్లపటేల్‌గూడ, తుర్కగూడ, కప్పాడు గ్రామాల ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారు. మార్చి నెలలో ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ పనుల వేగవంతంగా పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా?

ఎలిమినేడు 60ఫీట్ల రోడ్డు నుంచి చర్లపటేల్ గూడ గ్రామపంచాయతీ వరకు రోడ్డు తవ్వి కంకర పరిచారు. ఈ రోడ్డుపై నుంచి వెళ్లాలంటే వాహనదారులు నరకం చూస్తున్నారు. మార్చి 11న ఓ కారు అదుపు తప్పి చెట్టును ఢీకొట్టగా, మరో కారు రోడ్డు కిందకు దూసుకెళ్లింది. రోడ్డు పనుల సమయంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో నిత్యం ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. చర్లపటేల్‌గూడ, తుర్కగూడలో సీసీ రోడ్డుకు ఇరువైపులా మట్టి తీసి మిక్స్‌డ్‌కంకర పరచకపోడంతో రోడ్డు ప్రమాదకరంగా మారింది. ఒక వాహనం వస్తే మరొకటి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. రాత్రి వేళ ఈరోడ్డుపై ప్రయాణించలేకపోతున్న వాహనదారులు కర్ణగూడ నుంచి తిరిగి వస్తున్నారు. అదేవిధంగా రోడ్డు విస్తరణలో భాగంగా సీసీ రోడ్డు పక్కనే ఉన్న పైపులైన్ పాడై తాగునీటి సరఫరా నిలిచిపోయిందని ప్రజలు వాపోతున్నారు. పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చర్లపటేల్‌గూడ, తుర్కగూడ ప్రజలు కోరుతున్నారు.

రైతులు సేంద్రియ ఎరువులు వాడాలి

కడ్తాల్/ఆదిభట్ల/చేవెళ్ల/షాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పంటల మార్పిడి, సేంద్రియ ఎరువుల వినియోగం ద్వారా భూమి సారం దెబ్బతినకుండా ఉంటుందని శాస్త్రవేత్తలు డాక్టర్ అనిత, డాక్టర్ విద్యాసాగర్, డాక్టర్ శిరీష, దీప్తి, డాక్టర్ ఎన్. సుజాత, ఎం.స్వప్నశ్రీలు సూచించారు. కడ్తాల మండలం కర్కల్ పహాడ్, సాలార్‌పూర్‌లో శుక్రవారం రైతుముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా రైతు అవగాన సదస్సు లు నిర్వహించారు. మండల వ్యవసాయ శాఖ అధికారి శ్రీలత, ఏఈవోలు కశ్యప్, అనూష, రైతులు పాల్గొన్నారు. అలాగే రైతులు సేంద్రియ ఎరువులతో పంటలు పండించాలని, యూరియా వాడకం తగ్గించాలని శాస్త్రవేత్తలు డాక్టర్ రామ్‌ప్రకాష్, పద్మజ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం ఎలిమినేడులో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించి రైతులకు అవగాహన కల్పించారు. మంగల్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఏవో విద్యాధరి, ఏఈవో శ్రవణ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు శేఖర్ రెడ్డి. పంచాయితీ కార్యదర్శి రవీందర్ పాల్గొన్నారు. సేంద్రియ ఎరువులను ఉపయోగించాలని శాస్త్రవేత్తలు డాక్టర్ ప్రమీల, డాక్టర్ రమ్య, డాక్టర్ కవితా కిరణ్. స్నేహలత తెలిపారు. చేవెళ్ల మండలం ఇబ్రహీంపల్లి, ఖానాపూర్‌లో అవగాహన కల్పించారు. ఏవో శంకర్‌లాల్, కార్యదర్శి భాస్కర్ పాల్గొన్నారు. రసాయనాల వాడకాన్ని తగ్గించి, సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించి అధిక దిగుబడి పొందాలని శాస్త్రవేత్తలు, డి.శ్రీనివాస్‌రెడ్డి, పి.సతీష్, శిరీష, అర్చన అన్నారు. షాబాద్ మండలం చందన్‌వెళ్లి, రేగడిదోస్వాడలో అవగాహన సదస్సులు నిర్వహించారు. చందన్‌వెళ్లిలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చేవెళ్ల స్వామి తదితరులు పాల్గొన్నారు. ఏవో వెంకటేశం, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ మల్లేష్, ఏఈవోలు, రైతులు పాల్గొన్నారు.

నేర పరిశోధనకు సీసీ కెమెరాలు దోహదం

కడ్తాల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నేర పరిశోధన, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంతో దోహదపడతాయని ఎస్సై వరప్రసాద్ అన్నారు. న్యామతాపూర్ గ్రామానికి చెందిన బోదాసు మహేశ్ సామాజిక సేవలో భాగంగా స్థానిక హనుమాన్ ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ముందుకొచ్చాడు. ఈమేరకు రూ.10వేల విలువైన సోలార్ సీసీ కెమెరాను సమకూర్చి శుక్రవారం ఎస్సై సమక్షంలో సీసీటీవీ ఇన్‌చార్జి మహేశ్‌కందించారు. న్యామతాపూర్ సిబ్బంది, పోలీసు అధికారులు మహేశ్‌ను అభినందించారు. కెమెరాను ఆలయంలో అమరుస్తామని సీఐ గంగాధర్ తెలిపారు.

బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

ఆమనగల్లు, జూన్ 6(ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్లు 42 శాతానికి పెంచిన తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని, రిజర్వేషన్ల పెంపు కోసం సీఎం నేతృత్వంలో అఖిలపక్షంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ఢిల్లీకి వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం మండలాధ్యక్షుడు పిప్పళ్ల వెంకటేశ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వెంకటేశ్ కడ్తాల మండల కేంద్రంలో విలేఖరులతో మాట్లాడుతూ దేశవ్యాప్తంగా కులగణన చేపట్టి బీసీ రిజర్వేషన్లను పెంచాలన్నారు.

క్రైం కార్నర్

బైక్‌ను ఢీకొన్న లారీ.. వ్యక్తి దుర్మరణం

చేవెళ్ల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అతివేగం, అజాగ్రత్తతో లారీని డ్రైవ్ చేస్తూ ఎదురుగా వస్తున్న బైక్‌ను ఢీకొనడంతో బైకిస్ట్ మృతి చెందిన ఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సంతోష్‌రెడ్డి కథనం మేరకు.. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన పప్పు సింగ్ లారీని అతివేగంగా నడుపుతూ వికారాబాద్ నుంచి చేవెళ్ల మీదుగా హైదరాబాద్ వస్తున్నాడు. ఈక్రమంలో వికారాబాద్‌కు చెందిన హర్షవర్ధన్ (19) రాత్రి సమయంలో హైదరాబాద్ నుంచి చేవెళ్ల మీదుగా బైక్‌పై వికారాబాద్ వెళ్తున్నాడు. మార్గమధ్యలో చేవెళ్ల మండల పరిధిలోని దామరగిద్ద గేట్ సమీపంలోకి రాగానే లారీ ఢీకొనడంతో హర్షవర్ధన్ తలకు తీవ్రమైన రక్తగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

అర్హులందరికీ ఇళ్లు మంజూరు చేయాలి



కడ్తాల్ : ముగ్గుపోసి ప్రొసీడింగ్ అందజేస్తున్న నాయకులు

కడ్తాల్/కేశంపేట, జూన్ 6(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శుక్రవారం కడ్తాల ఎంపీడీవో సుజాతకు బీజేపీ నాయకుడు జంగం వెంకటేశ్ ఆధ్వర్యంలో పలు గ్రామాల నాయకులు వినతిపత్రం అందజేశారు. ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ కార్యకర్తలు తమకు అనుకూలమైన వారికి ఇళ్లు ఇచ్చేందుకు మొగ్గు చూపుతున్నారని, అయినప్పటికీ తమకు అభ్యంతరం లేదన్నారు. కానీ, అర్హులకు ఇళ్ల మంజూరులో అన్యాయం జరుగకుండా చూడాలన్నారు. రాజు, దీపక్ కుమార్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు. కాగా, కడ్తాల్ మండలం ముద్విన్‌లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ నిర్వహించారు. రేవంత్ మిత్రమండలి అధ్యక్షుడు నరేశ్‌గౌడ్ లబ్ధిదారులకు మంజూరు పత్రాలందజేశారు. కార్యదర్శి జగదీశ్, ఇందిరమ్మకమిటీ సభ్యులు నక్కపోతు నర్సింహ, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందుతాయని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కేశంపేట మండలం పాపిరెడ్డిగూడలో ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేపట్టారు. మహిళా కాంగ్రెస్ మండలాధ్యక్షురాలు రాజీ, మాజీ ఉపసర్పంచ్ సుందరయ్య, చేవెళ్ల నర్సింలు, కృష్ణారెడ్డి, రాఘవేందర్, దేవేందర్, శంకరయ్య, శివానంద్, ఆంజనేయులు, సత్తయ్య, సుధాకర్, జంగయ్య, ప్ర భాకర్, కార్యదర్శి రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

మేఘమా.. కురువవే!

(ఐదో పేజీ తరువాయి)

105.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 75.9 మిల్లీమీటర్లు అధికంగా కురిసింది. వర్షం బాగానే కురిసినప్పటికీ.. వారం రోజులుగా దంచి కొడుతున్న ఎండలకు విత్తులు భూమిలోనే మాడి పోయాయి. మొలకలు బయటకు రావడం లేదు. రైతులు వర్షం రాక కోసం ఆకాశంవైపు ఎదురు చూస్తున్నారు. 60 మిల్లీమీటర్ల వర్షం కురిస్తే విత్తనాలు వేసుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు పేర్కొంటున్నారు. వర్షాకాలం ఎంత త్వరగా విత్తనాలు వేస్తే అంత మంచిదని.. చీడపీడలు, ప్రకృతి వైపరీత్యాల బారిన పడకుండా పంటలు చేతికి వస్తాయని రైతుల నమ్మకం. అందుకే జూన్ నెల ప్రారంభం నుంచే విత్తనాలు వేస్తారు. రోహిణి కార్తెలో వరి నార్లు పోస్తారు. అయితే ఈ ఏడాది మే నెల చివరి వారంలోనే తొలకరి వర్షాలు కురిశాయి. జూన్ నెలలో కురవాల్సిన వర్షాలు ఇప్పటి వరకు జాడ లేదు. ముందస్తు కురిసిన వర్షాలకు విత్తులు విత్తుకున్నారు. తర్వాత వర్షం ముఖం చాటేయడం.. ఎండలు మంట పుట్టిస్తుండటంతో విత్తిన విత్తులు భూమిలోనే మాడి పోతున్నాయి. తక్కువ వర్షం కురిసిన చోట దుక్కులు దున్నిన తర్వాత కనీస స్థాయిలో కూడా భూమిలో తేమశాతం లేకుండా పోయింది. దీంతో వర్షం వస్తే కానీ విత్తనాలు నాటే పరిస్థితి లేదు. అదే విధంగా ముందుగా వేసిన విత్తనాలు మొలకెత్తకపోవడంతో వాటి స్థానంలో మళ్లీ విత్తనాలు వేయాల్సిన పరిస్థితి నెలకొంది. పంటకు పెట్టిన పెట్టుబడులు కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. మళ్లీ పంట కోసం అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొంది. రోజూ ఆకాశం మేఘావృతం కావడం.. వర్షం వస్తుందని ఆశగా చూడటం, తీరా వాన పడకపోవడంతో రైతుల నిరాశచెందటం పరిపాటిగా మారింది. మృగశిర కార్తెలోనైనా వరుణుడు కరుణించకపోతాడా అని ఆశల పల్లకీలో ఊగిసలాడుతున్నారు.

సాగు అంచనా 3.47 లక్షల ఎకరాలు

జిల్లాలో 3.47 లక్షల ఎకరాల్లో పంటలు సాగు చేయనున్నట్లు అధికారులు అంచనా వేశారు. ఈ సారి రైతులతో ఎక్కువగా వరి వేయించాలని నిర్ణయించింది. గతంలో కంటే పత్తి సాగును తగ్గించింది. సన్నాలకు ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుండటంతో అన్నదాతలు వరిపైనే మొగ్గు చూపుతున్నారు. గత ఏడాది 1,00,608 ఎకరాల్లో వరి సాగు చేయాలని నిర్ణయించగా ఈ ఏడాది దీన్ని 1,40,238 ఎకరాలకు పెంచారు. గత ఏడాది అత్యధికంగా 1,77,735 ఎకరాల్లో పత్తి సాగు చేయాలని నిర్ణయించగా... ఈ సారి 1,29,088 ఎకరాలకు పరిమితం చేశారు. 13,917 క్వింటాళ్ల విత్తనాలు, 72,200 టన్నుల ఎరువులు సిద్ధం చేశారు.

అధికార లాంఛనాలతో జవాన్ అంత్యక్రియలు



శ్రీనివాస్(ఫైల్)

కందుకూరు, జూన్ 6(ఆంధ్ర జ్యోతి): మండలంలోని చిప్పల పలికి చెందిన కంబం శ్రీనివాస్ ముదిరాజ్ సీఆర్పీఎఫ్ హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో మే 31న గుండెపోటు రాగా ఆస్పత్రికి తరలించారు. గురువారం రాత్రి మృతిచెందాడు. అంత్యక్రియలను శుక్రవారం పోలీసుల అధికార లాంఛనాలతో స్వగ్రామంలో నిర్వహించారు. పోలీసు ఉన్నతాధికారి(డీఎస్) మహేష్ నల్వారి ఆధ్వర్యంలో సీఆర్పీఎఫ్(చాంద్రాయణగుట్ట) సిబ్బంది, బంధువులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు మెడికల్ కిట్ల పంపిణీ

మాడ్గుల, జూన్ 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతీ గర్భిణికి మెడికల్ కిట్లు అందించాలని మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ వెంకటేష్ అన్నారు. ఆయన సహకారంతో ఇర్విన్‌లో శుక్రవారం ఆయన అనుచరులు 50 మందికి మెడికల్ కిట్లు అందించారు. బీఆర్‌ఎస్ నాయకులు యాదయ్య, జంగయ్య, శ్రీశైలం, ఎల్లయ్య, మల్లయ్య, తుప్పలయ్యలు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహభావం పెంపు



టోర్నీ ప్రారంభిస్తున్న సత్యనారాయణ

కొత్తూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు, గ్రామ మాజీ సర్పంచ్ ఎమ్మె సత్యనారాయణ అన్నారు. మండల పరిధిలోని ఎస్‌బీ పల్లిలో ఎర్ర శ్రీకాంత్, జామకాయల శివ స్మారక క్రికెట్ టోర్నీని శుక్రవారం ప్రారంభించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు కృష్ణ, నాయకులు పాండు, కృష్ణయ్య, అంబటి కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.